# వ్యాసవల్మీకం

(దక్షిణ భారత సాహిత్య వ్యాసాలు)



మహాకవి, సరస్వతీపుత్ర, పద్మశ్రీ

డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులు

# కథకళి సాహిత్యము

మలయాళ సాహిత్యాకాశమందు 'ఎజుత్తచ్చన్' మధ్యాహ్న సూర్యుడు. ఆ భావములు మహోత్తుంగములు. వాని ననుకరించుట యటుండ – వాని వైపు తేరిచూచుటకైన నితరులకు గుండెలాగలేదు. అతని యనంతరము మరియొక కవి యెవ్వడును, గావ్యరచనకు సాహిసించుటయే గష్టమైపోయినది. అందుకే, సాహిత్యరంగమున భిన్న ప్రస్థానములు బయలుదేరినవి. 'ఎజుత్తచ్చన్' ప్రారంభించిన మార్గమును సాగించుటకు సాహసింపని కవుల యంతస్సారములోని యవిశ్వాసమే 'కథకళి' సాహిత్యమునకు పురుడు దీర్చిన దనవచ్చును. ఆ యవిశ్వాసము మంచిదేయైనను. నేడు ద్వీపాంతరములలో గూడ పేరు మోసిన 'అట్టకథా' నిర్మాణము జరిగినది. ఒక్కొక్కసారి చెడుగు గూడ మంచిగనే పరిణమించుట ప్రకృతిలోని విశేషము.

'అట్టకథా' సాహిత్యము రూపొందినది 'ఎజుత్తచ్చన్'కు తర్వాతనంటిమి. కాని, యంతమాత్రమున నది హఠాత్తుగనైన సృష్టియని చెప్పుటకు వీలులేదు. దాని కంతకుముందే, వివిధములగు పూర్వరూపములున్నవి. ఆయా కాలమున నవి పరస్పర సాహచర్యమును, పరివర్తనమును జెందుచుండినవి. కాని యా సాహచర్యము సరసముగ నదికి యుండలేదు. గాసట బీసటగా బడియుండెను. బంగారమంతయు మూసలోనున్నది. చక్కగా కరగించి పోతపోయువాడు గావలెను. సరసమైన జాతికి స్వభావసిద్ధమైన నృత్త గీతాదులయందలి యనురాగము కేరళీయులకు పరంపరాగతమే. "చాక్కియార్ కూత్తు", "కూడిఆట్టమ్", "పాతకం" మొదలైనవి వారి కళాభిరుచియొక్క వేఱు వేఱు నిదర్శనములు. చేరులు ప్రాచీనకాలము నుండియు యుద్ధ విద్యయందాసక్తి గలవారు; ఆరితేరినవారును. కనుక, యుద్ధ ప్రక్రియతో సాజాత్యమున్న "పడయణి", "వేలకళి" మొదలైన సామూహిక కళావినోదముయందును వారి కభిరుచి కద్దు. వీని యన్నిటిలోను ఆ జాతి తమకు ప్రత్యేకమైన స్వభావములను, ఆచార విశేషములను, మానసిక వికారములను వ్యక్తీకరించి కొన్నది, తర్వాత వచ్చిన 'అట్ట కథా' సాహిత్యము వీని వికాసమే యనవచ్చును.

మొదటి నుండియు వారికార్యసాహిత్యముతోడి సంబంధము హెచ్చు అది కాలక్రమమున బెరిగినదే గాని తఱుగలేదు. అందుచే గీర్వాణవాసనలు భావాభిరామముగ మలయాళ సాహిత్యమున వీచి కొట్టినవి. పురాణములు, కావ్యములు, శాస్త్రములు, వీరియందా దేశీయుల కభినివేశము రాగరాగ హెచ్చుయ్యెను. 'చాక్కియార్ కూత్తు'లలోని ప్రవచన పద్ధతి దేశీయమే. కాని దానిలోని కథావస్తువు, కవిత్వము, సంస్కృతము నుండి తీసికొన్నవే. 'కూడియాట్ట' మందు గీర్వాణ నాటకములనే యుపయోగించి కొనుచుండిరి. రాగ రాగ జయదేవుని గీతగోవిందము వారి నాట్యరంగములలో నగ్రస్థానము సంపాదించికొన్నది.

అది నూతనమైన మఱికొన్ని సృష్టులకు దారిసూపెను. దాని పరిణామమే "కృష్ణ నాట్టము". దీని నిర్మాత "కోజికోడు" మానవేదరాజు. ఇతని కాలము కొల్లవర్షము తొమ్మిదవ శతాబ్దములోని ద్వితీయపాదము (క్రీ.శ. 1725) గీతగోవిందము – మఱి కొన్ని కేరళీయుల స్వభావ విశేషములు పోతబోసికొని పుట్టినది "కృష్ణనాట్టము".

కృష్ణనాట్టము పుట్టిన కాలము కేరళములో నంతశాంతమైనది గాదు. సామాజిక పరిస్థితి యస్వస్థముగ నుండెను. చిన్న చిన్న రాజులు, చిల్లర దేవుండ్లుగా తమలో దాము పందెములు వేసికొనుచున్న కాలమది. సామూహికములైన కళలకిట్టి కాలమేతగినదా ! యనిపించును. యుద్ధములు, రాష్ట్రీయ భావములు చెలరేగుచున్నప్పుడు, మనుష్యునిలోని యుత్సాహము, వినోదపరత యెక్కువగును. ఈ చిత్తవృత్తి నవకాశముగా గొనియే కేరళములో నభినయవిద్య వర్ధిల్లినదని చెప్పవచ్చు.

'కృష్ణనాట్ట'ముతో మాత్రమే జనుల కళాభిరుచి తృప్తిపడలేదు. 'చాక్కియార్ కూత్తు'న కంటెను, 'కూడియాట్ట'మున కంటెను దీనిలో గాంభీర్య మెక్కువయే. భక్తి – శృంగారాది రసముల స్ఫురణయు తగినంత యున్నది. కాని, వారి కళాపిపాసను దృప్తి పరచుటకు గావలసిన యన్ని హంగులును దీనిలో లేవు. 'కృష్ణనాట్టము' సంస్కృతమయము. అందుచే సామాన్యులకు దానిలో ముక్కు దూరలేదు. భాషలో మార్పుగావలసి వచ్చినది. కేరళీయులు యుద్ధప్రియు లంటిమి. కనుక వీర రౌద్రాది రసములు తృప్తిగా లేని కళలపై వారి కభిమానము తక్కువ. భారతజాతి హృదయమైన ధర్మ ప్రవణతయు – వారికి బ్రాణప్రదమైనదే 'కృష్ణనాట్ట'మున నున్న సంగీతము దేశీయముగాదు. ప్రత్యేకమైన వారి వాద్యముల కందులో జోటు లేకుండెను. ఇట్టివే మరికొన్ని యతృప్తులు. వీనిని దీర్చుటకే 'రామనాట్టము' పుట్టినది. దీనితో నీ కొఱతలు గొంతవఱకు దీఱిన వనవచ్చును. 'రామనాట్టము' కర్త 'కొట్టారక్కర త్తంబురాన్'. ఏడు దినముల కథయిది. పైదానికంటె యిది కొంత విలక్షణము. మణి ప్రవాళ శైలిలో గ్రంథావతరణ మొనర్పబడినది. పాటలు మలయాళమందే యున్నవి. అభినయము గృష్ణనాట్టమున కంటెను శాస్త్రీయమైనది. రామకథయే ధర్మా ధర్మో పదేశి ప్రవణముగదా! శృంగార, వీర, కరుణాది రసముల కది యునికిపట్టు. కనుక 'రామనాట్టము' సామాన్యజనుల దృష్టి నెక్కువగా నాకర్షించెను. కాని యది నేటి 'కథకళి' ప్రదర్శనములవలె నుండలేదు. వేష విధానము అభినయరీతి, వాద్యమేళము – వీనిలో నింకను గొఱత లెన్నియో యుండినవి. పాత్రల కాహార్యము చాల తక్కువగా నుండెను. కథాపాత్రలందులో సంభాషించెడివి; పాడెడివి. 'వేటత్తురాజు' గొంతసవరించెను. 'పురాణపురుషుల వేషధారణ మిట్టు గంభీరముగ నుండవలె'నని యతడు శాసించినాడు. వారి మనో వికారములను సూచించు మౌనాభినయమును గూడ నిర్దేశించినది యాతడే. అతని తరువాత 'తలప్పళ్ళి' దేశపువాడైన 'కప్లింగాట్టు నంబూరి'యు గొన్ని మార్పులు దెచ్చిరి. వారి మార్పులు ముఖ్యముగ వేష విధానమందు; అభినయమందు. ఇవి జరగినది యా జనుల యాచారవిశేషములను,

అభిరుచులను ననుసరించియే. వీరి తరువాత కూడ నప్పు డప్పుడెన్నియో తీర్పులు, చేర్పులు, జరిగి నేటి కథకళి స్వరూపమునకు వచ్చినవి. కేరళీయులింతగా ప్రేమించుకళ మరియొకటి లేదు. దీనిని వారు దేశదేశీయులకును బ్రచారము చేసినారు. వారి నాట్యరంగ మించుమించు మన 'బైలునాటక'ముల పద్ధతిగ యుండును. పాత్రలెప్పుడును మాటాడవు. అప్పుడప్పుడు దమ మనో వికారములను దెలుపుటకు గొన్ని ధ్వనులను మాత్రమొనర్చును. నాట్య రంగమునకు గుడియెడమలలో రెండు భద్రదీపములుండును. వానినిండ తైలమునుబోసి – దీపమును ముట్టింతురు. ఈ దీపములకు వాడునది 'వేరు సెనగ నూనె'యే. వానికి దప్ప యాతైలమును సామాన్యముగ నితరములకు వాడరు. 'కథకళి'లో ముఖ్యమైనది వేషరచన. ఆ వేషమును దీర్చుకొనుటకు గొన్ని గంటలు పట్టును. రంగులు కలుపుట, వానిని ముఖమున కంటించుట, వస్త్రములను ధరింపజేయుట మొదలగువానినే వృత్తిగా జేసికొని బ్రతుకువారు గొంద రాదేశమునసున్నారు.

రామనాట్టముగాని, కృష్ణనాట్టముగాని సాహిత్య సృష్టిలోనంత గొప్పవిగావు. ఈ నడుమ వాని నాడుట గూడలేదు. కాని, చారిత్రముగ వానికి గల ప్రాధాన్యమును మాత్రము ద్రోసివేయుటకు వీలులేదు.

'కొట్టయత్తింబురాన్' అట్టకథా సాహిత్యమునకు సాహితీ గౌరవమును గలిగించినవాడు. అతడు కవితాహృదయ మున్న యొక వ్యుత్పన్నుడు. కిమ్మీరవధలో నాతని కథావతరణ మిట్టున్నది?

*"మార్గే తత్ర నఖంపచోష్మల రజః పుంజే లలాటంతప*
*గ్రీష్మోష్మద్యుతి తామ్యదాననసరో జాతాం విలో క్యాదరాత్,*
*వాత్యోద్ధూళిత ధూళిజాల మసృణ చ్ఛాయాం సధర్మాత్మజో*
*మధ్యాహ్నే పరిదూయమాన హృదయాం తామ బ్రవీద్ద్రౌపదీం".*

దీనికి ద్రౌపది యిచ్చిన ప్రత్యుత్తరమునకు గథావతరణ మీ క్రింది శ్లోకము.

*"దీన దైన్య దమనం దయితా సా శృణ్వతీ సుమధురం ప్రతివాక్యం,*
*భారతీ మితి నరేంద్ర ముదారాం అబ్రవీ ద్ద్రుపదరాజతనూజా".*

పై రచన సంస్కృత కవులకంటె నెందులోను దీసిపోలేదు. కాని, యిది ప్రహతమైన యాలంకారిక పద్ధతిలో నడచిన రచన. అగాధమైన మనుష్య స్వభావమును వివేచించుటయందును, జీవిత నిరూపణమునందును, పాత్ర సృష్టిలోని చాతుర్య మందును, ఆ కవికి గొప్ప స్థానము లేదు. సహృదయుడైన యొకానొక పండితుని ప్రతిభావిలాసము మాత్రమా రచనలలో పుంజుకొని యుండును. శబ్దార్థాలంకారములను సమానమైన యధికారముతో నతడు వాడుకొనెను. చక్కని వ్యుత్పన్నుడాతడు. ముఖ్యముగ వాచ్యకవి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Vyasavalmikam**

* * *